క్లుప్తంగా

రేవంత్ పాదయాత్రలో జిల్లా నాయకులు



పాదయాత్రలో పాల్గొన్న జిల్లా నాయకులు

ఆదిలాబాద్‌అర్బన్: నిజామాబాద్ జిల్లా డిచ్‌పల్లిలో జరిగిన టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి హాథ్ సే హాథ్ జోడో యాత్రలో జిల్లా నాయకులు పాల్గొన్నారు. రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి పాదయాత్రలో నడిచారు. ఏఐసీసీ సభ్యుడు నరేశ్ జాదవ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ అల్లూరి సంజీవరెడ్డి, ఓబీసీ చైర్మన్ అంబకంటి అశోక్, సర్పంచ్ వసంత్ జాదవ్ తదితరులు ఉన్నారు.

పరీక్షల్లో ఒత్తిడికి గురికావొద్దు



అవగాహన కల్పిస్తున్న ఓం ప్రకాశ్

తాంసి: పరీక్షలు దగ్గర పడుతున్న సమయంలో విద్యార్థులు ఎలాంటి ఒత్తిడికి గురికావొద్దని రిమ్స్ సైక్రియాట్రిస్ట్ ఓం ప్రకాశ్ సూచించారు. మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు పరీక్షల సంసిద్ధత తదితర వాటిపై మహిత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో శనివారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా రిమ్స్ సైక్రియాటిస్ట్ ఓం ప్రకాశ్, తాంసి ఎస్సై లాల్ సింగ్ నాయక్ హాజరై మాట్లాడారు. విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదవాలని, ఎలాంటి ఒత్తిడికి లోనుకావొద్దన్నారు. ప్రతిరోజు ధ్యానం చేయడంతో ఏకాగ్రత పెరుగుతుందన్నారు. వైద్యాధికారి శ్రావ్యరాణి, మహిత కోఆర్డినేటర్ ఇమ్రాన్‌ఖాన్, కేజీబీవీ ప్రత్యేకాధికారి అలేఖ్య, పాఠశాల హెచ్‌ఎం రాజేశ్వర్‌రెడ్డి, ఉపాధ్యాయులు అమరేందర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.


అద్దె గదులకు వేలం నిర్వహించాలి



మాట్లాడుతున్న ఎంఎస్‌పీ నాయకులు

ఇచ్చోడ: మండల కేంద్రంలోని జెడ్పీ పాఠశాలలో అద్దె గదులకు వేలం పాట నిర్వహించాలని ఎంఎస్‌పీ నియోజకవర్గ కన్వీనర్ సిరిసిల్ల భూమయ్య పేర్కొన్నారు. మండల కేంద్రంలోని పార్టీ నాయకులతో కలిసి శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పాఠశాల గదులకు వేలం నిర్వహించకుండా ప్రసుతం అద్దె గదుల్లో ఉంటున్న దుకాణాల యజమానులకు సిబ్బంది పరోక్షంగా సహకరిస్తున్నారని అన్నారు. గత పదేళ్ల క్రితం వేలం నిర్వహించి కేవలం రూ.6 వేల అద్దెతో కొనసాగించడం వెనుక ఉన్న అంతర్యం ఏమిటని ప్రశ్నించారు. ప్రతి రెండేళ్లకోసారి గదులకు వేలం నిర్వహించాలని లేకపోతే మహాజన్ సోషలిస్టు పార్టీ తరఫున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో నియోజకవర్గ ఇన్‌చార్జి దుబాక సుభాష్, జిల్లా నాయకులు కల్లెపెల్లిరాజు, కాశిపాక విష్ణు, గంగాయ్య, పోశెట్టి తదితరులు పాల్గొన్నారు.

ఇంటి వద్దకే సీతారాముల కల్యాణ తలంబ్రాలు



రశీదును అందజేస్తున్న డిపో మేనేజర్ కల్పన

ఎదులాపురం: భద్రాద్రి సీతారాములు కల్యాణ తలంబ్రాలను భక్తులకు అందించేందుకు ఆర్టీసీ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. ఇందులో భాగంగా ఆర్టీసీ డిపోలో ఏర్పాటు చేసిన కౌంటర్‌ను డిపో మేనేజర్ కల్పన శనివారం ప్రారంభించారు. కల్యాణ తలంబ్రాలు భక్తులకు ఇంటి వద్దకే తీసుకువచ్చి అందిస్తోందన్నారు. కేవలం రూ.116 లతో ఆర్టీసీ ప్రత్యేక కౌంటర్‌లో పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఆర్టీసీ బస్టాండ్ తనిఖీ

బోథ్: బోథ్ ఆర్టీసీ బస్టాండ్‌ను నిర్మల్ ఆర్టీసీ డీఎం సాయన్న శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రయాణికులతో కలిసి మాట్లాడారు. బస్టాండ్‌లో సౌకర్యాల గురించి వారిని అడిగి తెలుసుకున్నారు. భద్రాద్రి సీతారాముల కల్యాణ తలంబ్రాల కోసం కార్గో సెంటర్‌లో బుక్ చేసుకోవాలని సూచించారు. అసిస్టెంట్ మేనేజర్ రాజశేఖర్, విడిసి అధ్యక్షులు గట్ల గంగాధర్, కార్గో నిర్వాహకులు శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.

పీహెచ్‌సీ భవన నిర్మాణమెప్పుడో?

- పాత భవనం శిథిలావస్థతో తాత్కాలికంగా మార్పు
- గత జూలై 16 నుంచి ఐకేపీ భవనంలో నిర్వహణ
- నూతన భవనానికి రూ.1.45 కోట్లు మంజూరు
- ఇంకా ప్రారంభం కాని పనులు



ఐకేపీ భవనంలో కొనసాగుతున్న పీహెచ్‌సీ నిర్వహణ

బేల: మండలకేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నూతన భవనం నిర్మాణ పనులు ప్రారంభమెప్పుడో..?నని ప్రశ్నార్థకంగా మారింది. ఏళ్ల క్రితం నిర్మించిన పాత భవనం గత మూడేళ్ల క్రితం పూర్తి ప్రమాదకర శిథిలావస్థకు చేరింది. ఈ క్రమంలో రెండుసార్లు ఈ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన అప్పటి జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ దీన్ని గుర్తించారు. దీంతో ఆమె చొరవతో ప్రజలకు వైద్య సేవల కోసం, వైద్య బృందం రక్షణ దృష్ట్యా ఈ పీహెచ్‌సీ నిర్వహణను తాత్కాలికంగా గత జూలై 16న ఐకేపీ కార్యాలయం భవనంలోకి మార్పు చేయించారు. అప్పటి నుంచి ఇప్పటిదాకా ప్రజలకు వైద్య సేవలు ఇంకా ఆ ఇరుకు భవనంలో కొనసాగుతున్నాయి.

భవనానికి రూ.1.45 కోట్లు మంజూరు

మండలకేంద్రంలోని పాత ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనం శిథిలావస్థకు చేరింది. ఈ విషయాన్ని ఎంపీపీ ఠాక్రే వనిత గంభీర్, జెడ్పీటీసీ అక్షిత సతీశ్ పవార్‌లు కలిసి ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న ప్రత్యేక చొరవతో (గతేడాది ఆదిలాబాద్‌కు వచ్చినప్పుడు)రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు దృష్టికి తీసుకెళ్లారు. గత 10నెలల క్రితం పీహెచ్‌సీ నూతన భవన నిర్మాణం కోసం పంచాయతీ రాజ్ శాఖ నుంచి రూ.1.45కోట్లు మంజూరయ్యాయి. ఇటీవల టెండర్ ప్రక్రియ పూర్తయింది.

ప్రారంభం కాని నూతన భవన పనులు

మండలకేంద్రంలోని పాత శిథిలావస్థపు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనం స్థలంలోనే నూతన భవన నిర్మాణ పనులు చేపట్టాల్సి ఉంది. పాత భవనం కూల్చాలో లేదో ఇంకా నిర్ణయం తీసుకోకపోవడంతో అలాగే ఉంది. పాత భవనం వెనుకలా చాలా ఖాళీ స్థలం ఉంది. నూతనం భవనం పాత భవనం కూల్చాలో, వెనుకలా నిర్మించాలో పంచాయతీ రాజ్ శాఖ అధికారులు ఏ నిర్ణయం తీసుకోలేపోతున్నారు. దీంతో నూతన భవన పనులు ఇంకా ప్రారంభం కావడం లేదు. సంబంధిత శాఖ జిల్లా ఉన్నతాధికారులు స్పందించి, వెంటనే పనులు ప్రారంభించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

పనులు చేపట్టాలి

పీహెచ్‌సీ పాత భవనం శిథిలావస్థకు చేరింది. కొత్త భవనానికి రెండేళ్ల నుంచి నిధులు మంజూరైందని చెబుతున్నారు. ఇంకా పనులు చేపట్టడం లేదు. ఉన్నతాధికారులు స్పందించి పనులు ప్రారంభించాలి.– యముర్లవార్ గణేశ్, బేల

ఐకేపీలో వైద్య సేవలు

పీహెచ్‌సీని గత జూలై నెలలో వైద్య సేవల కోసం ఐకేపీ ఆఫీస్‌లో మార్చారు. ఇంకా అక్కడే వైద్య సేవలు కొసాగుతున్నాయి. ఇతర గ్రామాల ప్రజలు వైద్యం కోసం ఎక్కడికి రావాలో తెలియక ఇబ్బంది పడుతున్నారు. ప్రైవేటు దవాఖానాకు వెళ్తున్నారు. వేంటనే కొత్త భవనం పనులు చేపట్టాలి.

– సునీల్, బేల

పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక



లక్కీ డ్రా ద్వారాఎంపిక చేస్తున్న అధికారులు

జైనథ్: సబ్సిడీ రుణాల కోసం లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా చేపట్టామని ఎంపీపీ మార్శెట్టి గోవర్ధన్ తెలిపారు. మండల కేంద్రంలోని రైతువేదికలో ఎంపీడీవో ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన లక్కీ డ్రా కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా దరఖాస్తుదారుల పేర్లు చీటీలపై రాసి లక్కీ డ్రా నిర్వహించారు. మైనార్టీ శాఖ ఆధ్వర్యంలో రుణాల కోసం మొత్తం 192 మంది దరఖాస్తు చేసుకోగా, ఇచ్చిన లక్ష్యం మేరకు నలుగురిని ఎంపిక చేశారు. వికలాంగుల్లో మొత్తం 61 మంది దరఖాస్తు చేసుకోగా, ఇద్దరిని లక్కీ డ్రా ద్వారా ఎంపికయ్యారు. గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, దరఖాస్తుదారులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి కృషి



సీసీ రోడ్డు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

బజార్‌హత్నూర్: గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే రాథోడ్ బాపూరావ్ తెలిపారు. మండలంలోని గిర్నూర్ గ్రామంలో ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో నిర్మించిన సీసీ రోడ్డును, సీడీపీ నిధులతో నిర్మించనున్న యాదవ సంఘం భవన నిర్మాణ పనులను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అన్నివర్గాల సంక్షేమం కోసం ప్రభుత్వం వివిధ సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిందని తెలిపారు. కార్యక్రమంలో కానిందే రాజారాం, కృష్ణ, గవ్వల సాయిచైతన్య, వినోద్, రాజేందర్, నారాయణ, డుబ్బుల శేఖర్, శ్రీనివాస్, పరచ సాయన్న, మహబూబ్, భాస్కర్‌రెడ్డి, కుర్మే లక్ష్మన్, విద్యాసాగర్, నాగోరావ్, అంకుశ్, ప్రకాశ్, జగదీశ్, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు మండల కమిటీ ఎన్నిక

ఆదిలాబాద్‌రూరల్: బీసీ సంక్షేమ సంఘం తలమడుగు మండల ఎన్నిక సమావేశాన్ని మండల కేంద్రంలోని రైతు వేదిక భవనంలో ఆదివారం ఉదయం 11 గంటలకు నిర్వహిస్తున్నట్లు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చిక్కాల దత్తు, కలాల శ్రీనివాస్ ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లా బీసీ సంక్షేమ సంఘం కార్యవర్గ, అనుబంధ సంఘాల సభ్యులందరూ హాజరుకావాలని సూచించారు.

వైభవంగా పోచమ్మ విగ్రహ ప్రతిష్ఠ



ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న సుహాసిని రెడ్డి



పూజలు చేస్తున్న విజయ డెయిరీ మాజీ చైర్మన్ లోక భూమారెడ్డి

ఆదిలాబాద్: జిల్లా కేంద్రంలోని సుందరయ్య నగర్ కాలనీలో శనివారం పోచమ్మ విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు చిట్యాల సుహాసిని రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కాలనీవాసులు, భక్తులు పెద్దఎత్తున తరలిరావడంతో సందడి వాతావరణం నెలకొంది.

సిరికొండ: మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో పోచమ్మ, మైసమ్మ విగ్రహాల ప్రతిష్ఠాపన శనివారం ఘనంగా నిర్వహించారు. ప్రవీణ్ స్వామి ఆధ్వర్యంలో విగ్రహాలను ప్రతిష్ఠించారు. ఎమ్మెల్యే రాథోడ్ బాపూరావ్, భక్తులు ఆలయంలో పూజలు చేశారు. అనంతరం అన్నదానం నిర్వాహించారు.

తలమడుగు: రుయ్యాడిలో చిన గోక సుభాష్‌రెడ్డి సొంత ఖర్చులు రూ.5 లక్షలతో శ్రీ హనుమన్ విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. పండితుల ఉదయం పూజా కార్యక్రమాలు చేపట్టారు. జెడ్పీటీసీ గోక గణేశ్‌రెడ్డి, విజయ డెయిరీ మాజీ చైర్మన్ లోక భూమారెడ్డి, సర్పంచ్ పోతరెడ్డి పాల్గొన్నారు.

ఉపాధి పనులు సద్వినియోగం చేసుకోవాలి



ప్రజావేదికలో నివేదిక చదువుతున్న తనిఖీ బృందం సభ్యులు

ఇంద్రవెల్లి: ఉపాధి పనులను కూలీలకు సద్వినియోగం చేసుకోవాలని డీఆర్‌డీవో కిషన్ కోరారు. ఎంపీడీవో కార్యాలయం వద్ద ఎంపీపీ పోటే శోభాబాయి శనివారం అధ్యక్షతన నిర్వహించిన ప్రజావేదికకు ఆయన హాజరయ్యారు. 2019, నవంబర్ 1 నుంచి 2022, మార్చి 31 వరకు జరిగిన రూ.26 కోట్ల నిధులతో ఉపాధి పనులు చేపట్టగా, తనిఖీ బృందం సభ్యులు వారం పాటు క్షేత్రస్థాయిలో సామాజిక తనిఖీ నిర్వహించారు. 28 పంచాయతీల వారీగా తనిఖీ బృందం సభ్యులు కూలీలకు కల్పించిన ఉపాధి పనులు, చేసిన ఖర్చు వివరాల నివేదికను చదివి వినిపించారు. ఈ నివేదికను పూర్తిగా పరిశీలించిన తర్వాత ఎలాంటి లోటుపాట్లు ఉన్న, అక్రమాలు జరిగిన రికవరీ చేయిస్తామన్నారు. అదనపు డీఆర్‌డీవో రాథోడ్ రవీందర్, ఏపీడీ సిద్దిక్, అంబుడ్స్‌మ్యాన్ వీణ, ఇన్‌చార్జి ఎంపీడీవో వేణు, అప్పటి ఎంపీడీవో రమాకాంత్, వైస్ ఎంపీపీ గోపాల్‌సింగ్, ఎంపీటీసీ గిత్తే ఆశాబాయి, సర్పంచులు జాదవ్ లక్కన్, కుడే కైలాస్, రాంచందర్, పార్వతిబాయి, తుంరం లక్ష్మణ్, ఎస్ఎంటీ నరేందర్, ఎస్ఆర్‌పీ రవి ఉన్నారు.

గురుకుల పాఠశాల వార్షికోత్సవం



జ్యోతిప్రజ్వలన చేస్తున్న ఎమ్మెల్యే రాథోడ్ బాపూరావ్



నృత్యాలు చేస్తున్న విద్యార్థులు

తాంసి: మండలంలోని బండల్‌నాగాపూర్ గ్రామంలోని మహాత్మా జ్యోతిబాపూలే బాలికల గురుకుల పాఠశాల వార్షికోత్సవాన్ని శనివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే రాథోడ్ బాపూరావ్ హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థినుల నృత్యాలు పలువురిని అలరించాయి. ఎంపీపీ మంజుల, ఆర్‌సీవో గోపిచంద్, సర్పంచ్ వెంకన్న, గురుకుల ప్రత్యేకాధికారి సమత పాల్గొన్నారు.

ఆశ్రమ పాఠశాలలో..

తలమడుగు: మండలంలోని ఝరి పూనగూడ బాలుర ఆశ్రమ పాఠశాల వార్షికోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా జెడ్పీటీసీ గోక గణేశ్‌రెడ్డి మాట్లాడుతూ పాఠశాల మౌలిక వసతుల కోసం జెడ్పీ నిధుల నుంచి రూ. 2 లక్షలు మంజూరు ఇస్తానని హామీ ఇచ్చారు. సర్పంచ్ రఘునాథ్, వైస్ ఎంపీపీ దివ్య మాదవ్, ఐటీడీఏ ఈఈ భీమ్‌రావు, ఐటీడీఏ ఏపీవో భాస్కర్, ఐటీడీఏ స్పోర్ట్స్ అధికారి పార్థసారధి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'నియోజకవర్గ అభివృద్ధికి చేసిందేమి లేదు'

ఆదిలాబాద్: నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్యే జోగు రామన్న చేసిందేమి లేదని బీజేపీ నాయకుడు కంది శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని కేఆర్‌కే కాలనీని శనివారం సందర్శించిన ఆయన కాలనీవాసుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటేసి గెలిపించిన ప్రజలను ఎమ్మెల్యే పట్టించుకోవడం లేదన్నారు. 14 ఏళ్లకు పైగా కాలనీలో నివాసముంటున్న ప్రజలకు కనీస మౌలిక వసతులు కరువయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్డు, తాగునీరు, విద్యుత్ సౌకర్యం లేదన్నారు. కేఆర్కే కాలనీ మురికి కూపంగా తయారైందన్నారు. పందులతో సావాసం చేస్తున్నారని మండిపడ్డారు. వీరికి ప్రభుత్వ పథకాలు అందడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. నాయకులు సంతోష్‌రెడ్డి, రాజ్‌కుమార్, కిష్టారెడ్డి, సంజీవ్, ఆకాశ్, రిషి, దేవిదాస్ ఉన్నారు.

సీఎం కేసీఆర్, మంత్రుల ఫ్లెక్సీకి క్షీరాభిషేకం

ఎదులాపురం: సెర్ప్ ఉద్యోగులు, జేఏసీ ఆధ్వర్యంలో జిల్లాకేంద్రంలో సీఎం కేసీఆర్, మంత్రులు, హరీశ్‌రావు, కేటీఆర్, ఎర్రబెల్లి దయాకర్‌రావు, ఎమ్మెల్సీ కవితల ఫ్లెక్సీలకు శనివారం క్షీరాభిషేకం చేశారు. ఉద్యోగులకు పే స్కేల్ వర్తింపజేస్తూ జీవో నెంబర్ 11ను విడుదల చేయడంపై వారు హర్షం వ్యక్తం చేశారు. జేఏసీ నాయకులు సోను, డీఆర్డీఏ ఏపీడీ చరణ్‌దాస్, డీపీఎంలు శేషరావు, హేమలత, శోభారాణి, నరేందర్, సుగంద, ఏపీఎం శ్రీనివాస్, 17 మండలాల ఏపీఎంలు, సీసీలు పాల్గొన్నారు.

అన్నివర్గాల సంక్షేమమే ధ్యేయం

- ఎమ్మెల్యే జోగు రామన్న



భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే రామన్న

ఆదిలాబాద్‌అర్బన్: అన్నివర్గాల ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. పట్టణంలోని రిక్షా కాలనీలో పలు కార్యక్రమాల్లో శనివారం ఆయన పాల్గొన్నారు. మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్, వార్డు కౌన్సిలర్ ఆవుల వెంకన్నతో కలిసి రూ.30 లక్షలతో నిర్మించనున్న సీసీరోడ్, డ్రెయినేజీ పనులకు భూమిపూజ చేశారు. అనంతరం అర్హత గల 320 మంది లబ్ధిదారులను పెన్షన్ కార్డులు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల అవసరాలను గుర్తించి.. నిరంతరం సంక్షేమ పథకాలను ప్రజలకు అందిస్తున్న నాయకుడు సీఎం కేసీఆర్ అని పేర్కొన్నారు. ప్రతి వార్డులో రూ.కోట్ల ఖర్చు చేస్తూ అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని అన్నారు. డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ జహీర్ రంజానీ, అజయ్, ఫ్లోర్‌లీడర్ బండారి సతీశ్, బీసీ పట్టణ అధ్యక్షుడు రమేశ్, కౌన్సిలర్ లక్ష్మణ్, ఏజాజ్, రాజు, సృజన్, మున్సిపల్ డీఈ తిరుపతి, ఆర్ఐ వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎక్కా మహాపూజ

జైనథ్: మండలంలోని గిమ్మ గ్రామంలో దత్త మందిరంలో ఎక్కా మహాపూజ కార్యక్రమాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే జోగు రామన్న హాజరై భక్తులతో కలిసి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత లభిస్తోందన్నారు. ఆలయ అభివృద్ధికి తనవంతుగా రూ.50 వేల విరాళం అందజేశారు. ఎంపీపీ మార్శెట్టి గోవర్ధన్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తుమ్మల వెంకట్‌రెడ్డి, రైతుబంధు మండల కోఆర్డినేటర్ సర్సన్ లింగారెడ్డి, సర్పంచ్ కోల సుమ, ఎంపీటీసీ కోల భోజన్న పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

శిశుమందిరాలు సంస్కృతి, సంప్రదాయాలకు నిలయాలు

ఇచ్చోడ: సరస్వతి శిశు మందిరాలు సంస్కృతి, సంప్రదాయాలకు నిలయాలని అధ్యాపకులు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బలరాం జాదవ్ అన్నారు. మండల కేంద్రంలోని సరస్వతి శిశు మందిర్ పాఠశాల్లో శనివారం నిర్వహించిన సరస్వతి విద్యాపీఠ స్వర్ణోత్సవాలు, పూర్వ ఆచార్యులు ఆత్మీయ సమ్మేళనంలో ఆయన పాల్గొని మాట్లాడారు. శిశుమందిరాల్లో చదువుకున్న ఎంతో మంది విద్యార్థులు ఉన్నత పదవుల్లో ఉండి దేశ సేవ చేస్తున్నారని తెలిపారు. తాను శిశుమందిర్‌లో చదువుకున్నానని అన్నారు. ఇందూర్ విభాగ్ ప్రముఖ్ నాగచారి, మండల విద్యాధికారి రాథోడ్ ఉదయ్‌రావు, శిశుమందిర్ పాఠశాల కార్యదర్శులు సంతోష్, గంగారెడ్డి, విద్యార్థులు, అచార్యులు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని కాపాడుకుందాం

బోథ్: మండలంలోని మర్లపెల్లి గ్రామంలో జెడ్పీ సెకండరీ పాఠశాల విద్యార్థులకు పర్యావరణం, ప్రకృతి, మొక్కలు, పక్షుల గురించి పక్షిప్రేమికుడు వెంకటేశ్ వివరించారు. పర్యావరణాన్ని కాపాడుకుందామని అన్నారు. ప్రజల దాహార్తిని తీర్చేందుకు ఇళ్లల్లో ప్రతి ఒక్కరూ నీటి తొట్టెలను ఏర్పాటు చేయాలన్నారు. ఈ సందర్భంగా పాఠశాలలో శనివారం నీటి తొట్టెలను ఏర్పాటు చేశారు. హెచ్‌ఎంలు రాంరెడ్డి, లక్ష్మణ్, జగదీష్, విజయ్‌కుమార్, సవిత, రావుల మహేందర్, సల్ల రవి, రాజు ఉన్నారు.

సరుకులు అందజేత

బోథ్: మండలంలోని సొనాల గ్రామానికి చెందిన తోట స్వామికి తుల శ్రీనివాస్ వెల్ఫేర్ సొసైటీ ఉపాధ్యక్షుడు ఇర్ల అభిలాష్ శనివారం నిత్యావసర సరుకులు అందించారు. ప్రతినెల సరుకులను అందిస్తామన్నారు.

ఇష్టపడి చదవాలి

ఆదిలాబాద్‌రూరల్: విద్యార్థులు ఇష్టపడి చదివి ఉత్తమఫలితాలు సాధించాలని జెడ్పీఎస్ఎస్ యాపలగూడ హెచ్‌ఎం ఎండీ ముజాఫర్ హుస్సేన్ అన్నారు. పాఠశాలలో శనివారం నిర్వహించిన ఎంఎస్‌సీ సమావేశంలో మాట్లాడారు. మధ్యాహ్న భోజనం, పిల్లల చదువు, కల్పిస్తున్న వసతి సౌకర్యాలు సమీక్షించారు. ఎస్ఎంసీ చైర్మన్ గంట రాజు, సభ్యులు, సర్పంచ్, ఉపసర్పంచ్, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఘనంగా ట్రెడిషనల్ డే

ఆదిలాబాద్: జిల్లా కేంద్రంలోని నలంద డిగ్రీ కళాశాలలో శనివారం ట్రెడిషనల్ డే ను ఘనంగా నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు సంప్రదాయ దుస్తులు చీర, ధోవతి, పంచెలు ధరించి ఆటపాటలతో అలరించారు. కళాశాల ప్రిన్సిపాల్ పున్నారావు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్‌సీసీ అండ్ ఎన్ఎస్ఎస్ అధికారి గాలి అశోక్, లెక్చరర్లు నర్సింగ్, శాంతి, రవళి, సాధన తదితరులు పాల్గొన్నారు.

8వ రోజుకు రిలే నిరాహార దీక్ష

ఆదిలాబాద్‌రూరల్: మావల మండలం బట్టిసావర్‌గాం శివారు ప్రాంతంలోని సర్వేనంబర్ 72లో కొనసాగుతున్న కుమరం భీంగూడవాసుల రిలే నిరాహార దీక్ష శనివారం 8వ రోజు చేరింది. గుడిసెలు వేసుకుని ఉంటున్న తమకు ఇంటి స్థలాల పట్టాలతోపాటు తాగునీరు, విద్యుత్, తదితర మౌలిక వసతులు కల్పించాలన్నారు.

నేటి నుంచి శనగల కొనుగోళ్ల నిలిపివేత

ఇచ్చోడ: ఇచ్చోడ మార్కెట్ యార్డులో ఆదివారం జరగాల్సిన శనగ కొనుగోళ్లు నిలిపివేస్తున్నట్లు వ్యవసాయ సహకార సంఘం సీఈవో రాథోడ్ ఈశ్వర్ తెలిపారు. కొనుగోళ్లు ఎప్పుడు నిర్వహించే తేదీని త్వరలో ప్రకటిస్తామని పేర్కొన్నారు. ఇచ్చోడ, గుడిహత్నూర్ మండలాల పరిధిలో రైతులు గమనించాలని కోరారు.

22 వరకు శనగ కొనుగోళ్లు నిలిపివేత

బేల: మండలకేంద్రంలోని సబ్ మార్కెట్‌యార్డులో ఈ నెల 22వరకు శనగ కొనుగోళ్లు ఉండవని బేల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సీఈవో తిరుపతి, కార్యదర్శి నిపుంగే గణేశ్ ఓ ప్రకటనలో తెలిపారు. వాతావరణ మార్పుల కారణంగా ఈ కొనుగోళ్లు నిలిపివేశామని పేర్కొన్నారు. దీన్ని గుర్తించి రైతులు సహకరించాలని కోరారు.

పేపర్ లీక్ చేసిన దోషులను కఠినంగా శిక్షించాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నిరుద్యోగులు

నేరడిగొండ: టీఎస్‌పీఎస్సీ పేపర్ లీక్ చేసిన దోషులను కఠినంగా శిక్షించాలని, చైర్మన్‌ను సైతం తొలగించాలని నిరుద్యోగులు డిమాండ్ చేశారు. మండల నిరుద్యోగుల ఆధ్వర్యంలో మండలకేంద్రంలో శనివారం నిరసన తెలిపారు. అనంతరం బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. తర్వాత తహసీల్దార్ కార్యాలయానికి చేరుకుని తహసీల్దార్‌కు మెమొరాండం అందించారు. ఈ ఘటనపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరపాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగుల నిరసనలో బీజేపీ మండల నాయకులు పాల్గొన్నారు.

వాహనం బోల్తా.. యువకుడు మృతి



వినేందర్ మృతదేహం

ఉట్నూర్‌రూరల్: మండలంలోని ఎక్స్‌రోడ్డులో ఓ వాహనం అదుపు తప్పి బోల్తా పడిన ఘటనలో ఓ యువకుడు మృతి చెందాడు. ఉట్నూర్ ఎస్సై భరత్ సుమన్ కథనం ప్రకారం.. ఉట్నూర్ మండలం హస్నాపూర్ గ్రామానికి చెందిన నలుగురు యువకులు శనివారం కూలీ పనుల నిమిత్తం ఇంద్రవెల్లికి వెళ్లారు. పనులు ముగించుకొని హస్నాపూర్‌కు మినీ ట్రక్‌లో తిరిగి వస్తున్నారు. రాత్రి 10 గంటల సమయంలో వాహనం వేగంగా వస్తుండగా ఎక్స్‌రోడ్డు సమీపాన ఎదురుగా వస్తున్న గేదెను డ్రైవర్ తప్పించబోయాడు. ఈ క్రమంలో వాహనం అదుపుతప్పి బోల్తా పడింది. ప్రమాదంలో నలుగురికి గాయాలయ్యాయి. వీరిని ఉట్నూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తీవ్ర గాయాలైన వినేందర్ (18) చికిత్స పొందుతూ మృతి చెందాడు. చేతికొచ్చిన కొడుకు మృతి చెందడాన్ని కుటుంబ సభ్యులు రోదిస్తున్న తీరు పలువురిని కంటతడి పెట్టించింది. మృతుడి తండ్రి తానాజీ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ రైతు మృతి

బోథ్: మండలంలోని తేజాపూర్ కాలనీకి చెందిన రైతు మేస్రం లక్ష్మణ్(28) చికిత్స పొందుతూ శనివారం మృతిచెందినట్లు ఎస్సై సాయన్న తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మద్యానికి బానిసై ఈనెల16న ఇంట్లో ఉన్న గడ్డి మందు తాగాడు. గమనించిన భార్య గ్రామస్తులకు సమాచారం అందించగా బోథ్‌లోని ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం రిమ్స్‌కు తరలించారు. అక్కడి నుంచి ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ మృతిచెందినట్లు ఎస్సై తెలిపారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

పరీక్షలంటే భయం వద్దు

అదిలాబాద్‌రూరల్: విద్యార్థులు పరీక్షలంటే భయం వీడాలని డీఈవో ప్రణీత అన్నారు. మండలంలోని యాపల్‌గూడ ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. పాఠశాలలో శనివారం ఏర్పాటు చేసిన పేరెంట్స్ కమిటీ సమావేశంలో మాట్లాడారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించడంతోపాటు, ప్రణాళిక ప్రకారం బోధన చేయాలన్నారు. హెచ్‌ఎం గంగన్న ఉన్నారు.

గురుకుల పాఠశాల సందర్శన

నార్నూర్: మండల కేంద్రంలోని ఏకలవ్య గురుకుల పాఠశాలలో శ్వాస సంబంధిత సమస్యతో బాధపడుతున్న విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలని బీజేపీ జిల్లా నాయకుడు భిక్షపతి రాథోడ్ అన్నారు. మండల కేంద్రంలోని ఏకలవ్య గురుకుల పాఠశాలను శనివారం సందర్శించి విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

'వచ్చే ఎన్నికల్లో బీజేపీదే విజయం'

బోథ్: వచ్చే ఎన్నికల్లో బీజేపీదే విజయమని ఆ పార్టీ నాయకులు పేర్కొన్నారు. హైదరాబాద్, పాలమూరు, రంగారెడ్డి టీచర్ల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి వెంకటనారాయణరెడ్డి విజయం సాధించడంతో నాయకులు శనివారం మండల కేంద్రంలో సంబురాలు జరుపుకున్నారు. రాజుయాదవ్, భూమేశ్, సూర్యం, భోజన్న ఉన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, వివాహ వార్షికోత్సవ శుభాకాంక్షలు | వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు | శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
ఆదిలాబాద్
99516 02888
99122 20764
Office mail : nzbadvt@gmail.com

సాక్షి పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
ఆదిలాబాద్ : కె.రమేష్ - 8019715058
బోథ్ : ఖాజా మొయినోద్దీన్ - 7997958184
టోల్ ఫ్రీ నెం. : 1800 425 9899